సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023







నేటినుంచి రెస్క్యూ పోటీలు

గోదావరిఖని: సింగరేణిలో 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు మంగళవారం నుంచి రెండురోజుల పాటు మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో జరగనున్నాయి. ఈసందర్భంగా ఆర్జీ–2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఫస్ట్ ఎయిడ్, డ్రిల్ అండ్ పరేడ్, రెస్క్యూరిలే, థియరీటెస్ట్, స్టాట్యుటరీ టెస్టులు రెస్క్యూ ప్రాంగణంలో, ప్రాక్టికల్స్ జీడీకే–7ఎల్ఈపీ గనిలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా డీడీఎంఎస్ అధికారులు పోటీలు నిర్వహించనున్న ప్రాంతాలను పరిశీలించారు. సింగరేణివ్యాప్తంగా ఆరు టీంలు రెస్క్యూ పోటీల్లో పాల్గొననున్నాయి.

అసెంబ్లీ ఆట మొదలు

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో వేడెక్కిన రాజకీయం
- ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థులు
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని ఇతర పార్టీలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అమల్లోకి కోడ్



ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- నోటిఫికేషన్ - నవంబర్ 3
- నామినేషన్లకు ఆఖరు తేదీ - నవంబర్ 10
- నామినేషన్ల పరిశీలన - నవంబర్ 13
- ఉపసంహరణకు ఆఖరు తేదీ - నవంబర్ 15
- పోలింగ్ తేదీ - నవంబర్ 30
- ఓట్ల లెక్కింపు - డిసెంబర్ 3

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సైరన్ మోగిస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. ఇక నుంచి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమావేశాలు జరుపరాదు. ఆన్ గోయింగ్ స్కీంలను కొనసాగించవచ్చు. ఎన్నికల తంతు అధికారికంగా ప్రారంభం కావడంతో పల్లెల్లో, పట్టణాల్లో ప్రచార పర్వం మొదలు కానుంది. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్ఎస్ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం ప్రారంభించింది. నెల రోజుల కిందే అభ్యర్థులను ప్రకటించడంతో 10 రోజులుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బీసీ చేయూత పథకం, గృహలక్ష్మి, మైనారిటీ, క్రిస్టియన్ బంధు పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందించే కార్యక్రమాలను ముమ్మరం చేశారు. పెండింగ్ పనుల పూర్తి, హామీలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించి, పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపారు.

అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ

శాసనసభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అధికార పార్టీని ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటివరకు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. పార్టీలపై ప్రజల్లో సానుభూతి ఉన్నా అనుకూలంగా మలుచుకోవడంలో విఫలమవుతున్నారన్న భావన ఉంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరించినా ఖరారు చేయలేదు. ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలో టికెట్లను ఆశిస్తున్న నేతలు పైరవీల్లో మునిగిపోయి, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మిగతా పార్టీల విషయానికొస్తే.. బహుజన సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. జనసేన పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేస్తామని నియోజకవర్గాల పేర్లను ప్రకటించిందే తప్ప అభ్యర్థులను వెల్లడించలేదు.

3.2 లక్షలు పెరిగిన ఓటర్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12, 283 మంది ఓటర్లు ఉన్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 31.12 లక్షలు దాటింది. మొత్తంగా చూసినప్పుడు ఐదేళ్ల క్రితానికి ఇప్పటికి 3,24,198 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో యువతే ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో దాదాపు అన్ని పార్టీలు వారిని లక్ష్యంగా చేసుకొని, మేనిఫెస్టో, ప్రచారానికి రూపకల్పన చేస్తున్నాయి.

ఇవి చేయడానికి వీల్లేదు..

- కోడ్ అమల్లోకి వచ్చినందున మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక పర్యటనలు చేయరాదు.
- ప్రభుత్వ పథకాలు, ప్రచారాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.
- ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ప్రతీ అభ్యర్థి ఖర్చుపై నిఘా ఉంటుంది.
- కొత్త పథకాల ప్రకటన, మౌలిక సదుపాయాల కల్పనపై ఎలాంటి హామీలు ఇవ్వకూడదు. అధికారిక వాహనాల వినియోగంపై పరిమితులు ఉంటాయి.
- నగదు రవాణా విషయంలో బంగారం, వడ్డీ, బ్యాంకింగ్ అధికారులతోపాటు సామాన్యులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికీ కావాల్సిన ఇన్వాయిస్, బిల్లులు దగ్గర పెట్టుకోవాలి.
- లైసెన్స్‌డ్ ఆయుధాలన్నీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సరెండర్ చేయాలి. ప్రార్థనా స్థలాల వద్ద ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు.
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎలాంటి కానుకలు, డబ్బు, మద్యం పంచకూడదు.
- రాజకీయ విమర్శలు చేసే క్రమంలో వర్గాన్ని, నాయకుడిని ఉద్దేశిస్తూ.. విద్వేష వ్యాఖ్యలు చేయరాదు.
- ర్యాలీలు, సభల విషయంలో అధికారుల అనుమతి తీసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ రెమా రాజేశ్వరి, అధికారులు

- ఎలక్షన్ కమిషన్ నియామవళికి అనుగుణంగా ఏర్పాట్లు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: శాసనసభ సాధారణ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్ హాజరయ్యారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమావేశమయ్యారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం నియామావళికి లోబడి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేసుకున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. వెబ్‌సైట్లలో సీఎం, మంత్రుల ఫొటోలు తొలగించాలని ఆదేశించారు. ర్యాలీలు, సభల నిర్వహణకు నిబంధనల ప్రకారం అనుమతి ఇవ్వాలని, ఇందులో ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతి పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

3వరకు అన్నీ సిద్ధం..

నవంబర్ 3న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే సమయానికల్లా సర్వం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల పర్యవేక్షణకు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను సిద్ధం చేయాలని, కంట్రోల్ రూం, మీడియా సెంటర్ అందుబాటులోకి తేవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని చెప్పారు. దివ్యాంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గానికో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా సీవిజిల్‌యాప్ యాక్టివ్ కాలేదని కలెక్టర్ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి పోర్టల్‌లో పెండింగ్ ఫారాలు కనిపించడం లేదని, వీటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఆర్డీవోలు మధుమోహన్, హనుమానాయక్, ఏసీపీలు ఎడ్ల మహేశ్, తులా శ్రీనివాసరావు, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



ప్రశంసపత్రాలు అందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: ఎన్నికల సంఘం పర్యవేక్షణ, నియంత్రణ, క్రమశిక్షణకు లోబడి పోలీసు యంత్రాంగా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. సోమవారం కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని చెప్పారు. సీసీకెమెరాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, అమ్మేవారు, తాగేవారు, గుడుంబా తయారీదారులు, బెల్లం అమ్మేవారు, రవాణా చేసేవారి జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. ఇతర శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంఘ విద్రోహశక్తులు, రౌడీషీటర్లు, అనుమానితులు, హిస్టరీ షీట్ ఉన్నవారిని బైండోవర్ చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతర్‌రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఎల్లవేళలా సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో విధిగా పర్యటించాలని పేర్కొన్నారు. విచారణలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ చెప్పారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని సీపీ రెమా రాజేశ్వరి సూచించారు. కాగా, గత రెండు నెలల్లో ఫంక్షనల్ వర్టికల్స్‌లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు సీఐలు, 15మంది ఎస్సైలు, 10మంది ఏఎస్‌ఐలు, 27మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 76మంది కానిస్టేబుళ్లకు రివార్డు మేళా నిర్వహించిన సీపీ.. వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, సుధీర్ కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ హుల్ హక్, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు తులా శ్రీనివాసరావు, మహేశ్, తిరుపతిరెడ్డి, మోహన్, సదయ్య, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సైబర్ క్రైమ్ ఏసీపీ రాజేశ్, ఈవో నాగమణి, ఏఆర్ ఏసీపీలు సుందర్‌రావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'సుందరంగా తీర్చిదిద్దుతాం'



పనులు ప్రారంభిస్తున్న ముత్యం సునీత

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపల్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని బల్దియా చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. కౌన్సిలర్లు మమత, పారుపల్లి జ్ఞానేశ్వరి, అనుమండ్ల అరుణ, కూకట్ల గోపి, తిరుపతి, కమిషనర్ మల్లికార్జున్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

నేటినుంచి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు



రామగుండం: కాజీపేట–సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య ఇరువైపులా ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను మంగళవారం పునరుద్ధరిస్తారు. ఈమేరకు ప్రజా సంబంధాల ప్రతినిధి క్యాతం వెంకటరమణ సోమవారం తెలిపారు. భద్రాచలంరోడ్ సింగరేణి, కాజీపేట రామగిరి, కరీంనగర్ పుష్‌పుల్ తదితర ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ఇకనుంచి యథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు. మరోమూడు రోజుల్లో దసరా సెలవులు ప్రారంభం కానుండడంతో రైల్వేశాఖ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



వినతిపత్రం స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యుత్ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా వినియోగదారుల ఫోరం పనిచేస్తోందని ఎన్పీడీసీఎల్ చైర్‌పర్సన్ ఎస్.వేణుగోపాలచారి అన్నారు. స్థానిక మార్కండేయకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బిల్లుల తోపాటు మీటర్లలో లోపాలు, లో వోల్టేజీ సమస్యలు, కొత్త సర్వీస్‌ల విడుదలలో జాప్యం, యజమాని, పేరు మార్పిడి, లోడ్ వివాదం తదితర సమస్యల గురించి వివరించారు. కాగా, మూడు సమస్యలు సదస్సు దృష్టికి రాగా వెంటనే పరిష్కరించడంతో వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుమల్‌రావు, చరణ్‌దాస్, నరేందర్, ఎస్ఈ గంగాధర్, డీఈఈ తిరుపతి, ఏడీ వెంకటేశ్వర్లు, ఏఈలు రంగు శంకరయ్య, ప్రసాద్, సైఫ్, సంపత్, సర్పంచ్ పొన్నాల స్వరూప, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె విరమణ



నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేస్తున్న డీఈవో

పెద్దపల్లిరూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు 22 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెను సోమవారం విరమించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన వర్కర్లకు డీఈవో మాధవి నిమ్మరం ఇచ్చి సమ్మె విరమింపజేశారు. మంగళవారం నుంచి పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తామని మధ్యాహ్న భోజన వర్కర్లు పేర్కొన్నారు. నాయకులు సునిల్, రమేశ్, చంద్రశేఖర్, కరీం, రమ, సరోజన, గట్టయ్య, తిరుపతి, వసంత, అంజుమ్, ఫాతిమాబేగం, నాగలక్ష్మి, రజిత, జుబేదా, లావణ్య, లీలావతి, లక్ష్మి పాల్గొన్నారు.

మంథనికి రూ.10కోట్లు

మంథని: మున్సిపాలిటీలో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అభ్యర్థన మేరకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిధులు మంజూరుకి ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం నిధులు మంజూరు చేశారు.

సారూ.. సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు అభాగ్యుల విన్నపం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఏవో శ్రీనివాస్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనుమతినివ్వొద్దు



మా ఊరులోని జనావాసాల నడుమ రైస్‌మిల్లు, గోదాంలు నిర్మిస్తున్నరు. కా లుష్యం, దుమ్ము, ధూళి వెదజల్లే మిల్లు, లక్కపురుగులు వ్యాపించే గోదాంలకు అనుమతినివ్వొద్దు.

– నిట్టూరు గ్రామస్తులు

పింఛన్ ఇప్పించండి



చాలాకాలం నుంచి వచ్చే పింఛన్ కొద్దినెలలుగా వస్తలేదు. ఆఫీసుల చుట్టూ తిరి గినా పట్టించుకుంటలేరు. కలెక్టర్ దృష్టి సారించాలి.

– మహమ్మద్ కరీముద్దిన్, రామగుండం

ఆన్‌లైన్‌లో లేదు



నాకున్న 20గుంటలు ఆన్‌లైన్ లేవు. అధికారుల చు ట్టూ తిరుగుతున్నా పట్టించుకుంటలేరు. ప్రభుత్వ సాయం అందడంలేదు. నాకు న్యాయం చేయండి.

– కుంబాల లింగయ్య, నిమ్మనపల్లి

'గుర్తింపు' ఎన్నికలపై నీలినీడలు

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో బ్రేక్!
- రేపు హైకోర్టు తీర్పు వెలువరించే అవకాశం



గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా పడేఅవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఏడు జిల్లాల్లోని 11 ఏరియాల్లో విస్తరించిన సింగరేణి సంస్థలో సుమారు 42వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో మాదిరిగానే సింగరేణిలో ఈసారి కూడా గనులపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిన నిర్వహించాల్సి ఉంది. మినీ అసెంబ్లీని తలపించేలా ప్రచారం ఉంటుంది. అయితే ఎన్నికలు నిర్వహించేందుకు ఒక్కో ఏరియాకు పెద్ద సంఖ్యలో పోలీసు, ఎన్నికల సిబ్బంది అవసరం ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రతీజిల్లాలోని కలెక్టర్‌తోపాటు ముఖ్య అధికారులు ఆ ఎన్నికల నిర్వహణపైనే ప్రధానంగా దృష్టి సారిస్తారు. అంతేకాదు.. సింగరేణి ఎన్నికలకు ప్రత్యేకంగా పోలీసు బలగాలను కేటాయించడం కష్టంగానే మారుతుందని తెలుస్తోంది. దీంతో గుర్తింపు ఎన్నికలపై నీలినీడలు అలముకుంటున్నాయి. మరోవైపు.. ఇప్పుడు ఎన్నికలు నిర్వహించడానికి తాము సిద్ధంగా లేమని సింగరేణి యాజమాన్యం చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంకా సంసిద్ధత తెలుపలేదు. అయితే, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల కోసం ఈనెల 6, 7తేదీల్లో అన్ని కార్మిక సంఘాలు నామినేషన్లు వేశాయి.

11న కోర్టు తీర్పు కీలకం

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించలేమని సింగరేణి యాజమాన్యం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అయితే, యూనియన్లకు సమాన ప్రాతినిధ్యం ఇస్తూ సర్క్యులర్ జారీచేశామని, గత గుర్తింపును రద్దు చేశామని పేర్కొంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సిన అత్యవసర పరిస్థితి ఏమీలేదని స్పష్టం చేసింది. అయితే ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. ఈనెల 11వ తేదీకి తీర్పు వాయిదా వేసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు మాత్రం గత కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామంటున్నారు. కోర్టు డైరెక్షన్ ప్రకారం ఎన్నికల నిర్వహించడమా? లేదా? అనేది చూస్తామన్నారు.

దుర్మార్గపు పాలన వద్దు

- డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: బీఆర్ఎస్ దుర్మార్గపు పాలన వద్దని, ఆ పాలకులను తరిమి కొట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం ప్రజాదీవెనయాత్ర 4వ రోజు స్థానిక విఠల్‌నగర్, జవహర్‌నగర్, తిలక్‌నగర్ ఏరియాల్లో కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అప్పుడు కోరుకంటి చెప్పిన మాటలు విని మోసపోయామని, ఇప్పుడు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్తామన్నారు. తెలంగాణ ఇచ్చింది, దేశప్రజల కోసం అనేక త్యాగాలు చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాల గురించి ప్రజలు ఉత్సాహంగా తెలుసు కుంటున్నాని అన్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. పార్టీకి ప్రజలల్లో ప్రస్తుతం ఆదరణ పెరుగుతోందని చెప్పారు. నాయకులు చుక్కల శ్రీనివాస్, కొత్త రవి, సూర మోహన్, శోభ, మానస, స్వరూప, మల్లయ్య పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా గోదావరి తీరం





ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు, గోదావరిలో చందర్ బోటింగ్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: గోదావరి నదీతీర ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరి నదిలో తెలంగాణ టూరిజం బోటును ఆయన సోమవారం ఉదయం ప్రారంభించి మట్లాడారు. సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరంతో గోదావరి పరీవాహక ప్రాంతం పర్యాటకంగా మారబోతోందన్నారు. కార్పొరేటర్ దాతు శ్రీనివాస్, నాయకులు కౌశిక హరి, తోకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల, సిద్దిపేటలా అభివృద్ధి..

బీఆర్ఎస్‌ని భారీ మెజార్టీతో గెలిపించి మంత్రి కేటీఆర్‌కు బహుమతిగా ఇద్దామని ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులు, మరమ్మతులు, ఇతర పనులకు ఆయన భూమిపూజలు చేశారు. తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి వైద్య కళాశాల మంజూరు చేయించామన్నారు. కాంగ్రెస్ ఇప్పటివరకు సీఎం అభ్యర్థిని పకటించలేదన్నారు. ఢిల్లీ నుంచి వచ్చే సీల్డ్ కవర్‌లో ఎవరు వస్తారో తెలియదని, ఏం చేస్తారో తెలియదన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు రఫీ, నాయకులు కౌశిక్ హరి, నారాయణదాసు మారుతి, రాకం వేణు, కనకం శ్యాంసన్, జాహిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: ఎల్కలపల్లి – గుంటూరుపల్లి మధ్య చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపుల నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్, నాయకులు కౌశిక్ హరి, పసుపుల భాస్కర్, దెబ్బెడ్డ భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పాలకుర్తి(రామగుండం): వివిధ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ వ్యవసాయ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, కో ఆప్షన్ సభ్యుడు సర్వర్ పాషా, నాయకులు కౌశిక హరి, సర్పంచులు మల్లెత్తుల శ్రీనివాస్, దుర్గం జగన్, శారద, నర్సమ్మ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధి లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: అన్నివర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పట్టణంలో పద్మశాలీ సేవా సంఘం, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం భవనాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శంకర్ నాయక్, అంజలీదేవి, తాళ్ల అమృత, కిషన్‌రెడ్డి, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు కౌశిక్ హరి, చక్రపాణి, సాంబయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యైటింక్లయిన్‌కాలనీ: అల్లూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8న ఎన్‌టీపీసీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో అక్షయ, సుద్దాల సిద్దార్థ రావుల సిద్దిగణేశ్ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపీకృష్ణ తెలిపారు. విద్యార్థులతోపాటు యోగా మాస్టర్ బాదే వెంకటేశ్‌ను హెచ్‌ఎం గోపీకృష్ణ, ఉపాధ్యాయులు కార్పొరేటర్ అంజలీదేవి అభినందించారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన నాయకులు

పాలకుర్తి: ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణను కార్మిక సంఘం నాయకులు సోమవారం గోదావరిఖనిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణి గుర్తింపు కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, సహాయ కార్యదర్శి పోతుల ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు లక్ష్మీనారాయణను పూలమాల, శాలువాతో సత్కరించారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ

గోదావరిఖనిటౌన్: పట్టణంలో తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణానికి రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సోమవారం భూమిపూజచేశారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చొరవతో సుమారు రూ.30లక్షలు మంజూరయ్యాయన్నారు. సింగరేణి ఏజీఎం లక్ష్మీనారాయణ, తెలంగాణ అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ చైర్మన్ న్యాతరి రాయమల్లు, కో ఆర్డినేటర్ మైస రజేశ్, జనరల్ సెక్రటరీ బొంకూరి మధు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయం ప్రారంభిస్తున్న అతిథులు

ఎలిగేడు(పెద్దపల్లి):గ్రంథాలయాలను యువత, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. ధూళికట్టలో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయంలో పోటీపరీక్షలకు ఉపయోగపడే బుక్స్ అందుబాటులో ఉంటాయన్నారు. పోటీ పరీక్షలు సిద్ధమయ్యే యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొల్లె కావేరి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, వార్డుసభ్యులు మేచినేని శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుర్జుకమ్మి భూములపై సర్వహక్కులు

- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు
- ఆరు దశాబ్దాల తర్వాత సమస్యకు పరిష్కారం



భూములు సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం రాయదండి, పెద్దంపేట శివారుల్లో విస్తరించి ఉన్న కుర్జుకమ్మి భూసమస్య సుమారు ఆరు దశాబ్దాల తర్వాత పరిష్కారమైంది. ఈ రెండు గ్రామాల పరిధిలో 1,018 ఎకరాల్లో అధికారులు ఇటీవల సర్వే చేశారు. అందులో బీపీఎల్‌కు చెందిన, ఇళ్లు నిర్మించుకున్న భూములు తీసివేస్తే.. 427 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. అందులో 476 మంది రైతులు వివిధ పంటలు సాగు చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు వారికి ఇటీవల ప్రొసీడింగ్స్ అందాయి.

కుర్జుకమ్మి భూములు అంటే..

భూ రికార్డుల్లో పట్టాదారు పేరును ఖాతా నుంచి తొలగించి ప్రభుత్వ జాబితా(అధీనం)లో నిరుపయోగంగా ఉన్నవాటిని కుర్జుకమ్మిగా పేర్కొంటారు. రాయదండి, పెద్దంపేటలోని 193 సర్వే నంబర్లలో ఇలాంటివి 1,018 ఎకరాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

భూ సేకరణ ఎప్పుడు, ఎందుకు చేశారు...?

స్వాతంత్య్రానికి పూర్వం నిజాం హయాంలో అజామాబాద్ ఇండస్ట్రియల్ పేరిట పరిశ్రమల స్థాపన కోసం రైతుల నుంచి నామమాత్రపు ధరకు వేలాది ఎకరాలు సేకరించారు. ఆరు దశాబ్దాలు గడిచినా అందులో అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీంతో ఆ భూములు ప్రభుత్వ అధీనంలోనే ఉండిపోయాయి. రైతులు నేటికీ సాగు చేసుకుంటున్నా.. వాటిపై హక్కులు లేవు. వాటిపై తమకు హక్కులు కల్పించాలని కోరుతూ 1986లో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో కుర్జుకమ్మి భూములపై రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు లభించాయి.

విలువవచ్చింది



మాకు మూడు ఎకరాల కుర్జుకమ్మి భూమి ఉంది. ఇన్నాళ్లూ సాగు చేసుకుంటున్నా హక్కులు లేవు. ప్రస్తుతం అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. మా కుటుంబ ఆస్తి పెరిగినట్లయింది. ఆర్థిక భరోసా వచ్చింది.

– కొలిపాక శరణ్య, లబ్ధిదారు

కల సాకారమైంది



కుర్జుకమ్మి భూసమస్య పరిష్కరిస్తామని ప్రతీ ఎన్నికల్లో నాయకులు హామీలు గుప్పించి ఓట్లు దండుకునేవారు. ఇప్పుడు మాకు 2.5 ఎకరాలకు కుర్జుకమ్మి అసైన్డ్ పట్టా వచ్చింది. నేను అదృష్టంగా భావిస్తున్నా.

– మేర్గు భాగ్యమ్మ,, లబ్ధిదారు

దివ్యక్షేత్రం.. ఓదెల మల్లన్న ఆలయం

- ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ మల్లేశంయాదవ్, పాలకవర్గసభ్యులు

ఓదెల(పెద్దపల్లి):భక్తులకు దివ్యక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి ఆలయమని ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్ అన్నారు. దేవస్థానంలో సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో భక్తులకు అన్నివసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే కోనేటి నిర్మాణం పూర్తయ్యిందని, విద్యుత్ దీపాలంకరణ కోసం సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. దాతల సాయంతో ఐదు సత్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.10కోట్ల వ్యయంతో మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కాగా, పెద్దపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఈవో సదయ్య సమక్షంలో పాలకవర్గం పదవీ ప్రమాణస్వీకారం చేసింది. ఈకార్యక్రమంలో ప్రధాన అర్చకులు దూపం వీరభద్రయ్య, పెద్దపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, యాదవ సంఘం నాయకులు తమ్మెడబొయిన ఓదెలు యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. మల్లికార్జునస్వామి జ్ఞాపిక బహూకరించారు.

ఖనిలో మెగా జాబ్ మేళా

- 1,800 మంది నిరుద్యోగుల హాజరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: నగరంలోని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దాదాపు 30 కంపెనీలు హాజరయ్యారు. వివిధ ఉద్యోగాలకు 2,300 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 1,800 మంది హాజరయ్యారు, అందులో 250మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, 140 మందికి నియామక పత్రాలను ఎమ్మెల్యే చందర్ అందజేశారు.

30 కంపెనీలు హాజరు



మెగా జాబ్ మేళాకు దాదాపు 30 కంపెనీలు వచ్చాయి. తమ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేశాయి. చురుకైన వారిని ఎంపి క చేసుకున్నాయి.

– ఎ.గంగాప్రసాద్, టాస్క్ మేనేజర్, ఉమ్మడి జిల్లా

నెలకు రూ.10వేల వేతనం



నేను ఇంటర్ వరకు చదువుకున్న. మెగా జాబ్‌మేళాకు వచ్చిన హైదరాబాద్‌లోని అపోలో కంపెనీలో జాబ్ వచ్చింది. నెలకు రూ.10,600 సాలరీ ఇస్తరట. జాబ్ రావడం నా అదృష్టం.

– ఐత అజయ్‌కుమార్, గోదావరిఖని

ప్రేమ విఫలమై.. మనసు కలత చెంది..

- రైలుకు ఎదురుగా.. పట్టాలపై పడుకుని యువతి ఆత్మహత్య



కల్వల శార్వాణి మృతదేహం

రామగుండం: ఇన్‌స్టాగామ్‌లో పరిచయం యువకుడి, యువతి మధ్య ప్రేమగా మారింది. అయితే, తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో యువకుడు తిరస్కరించాడు. దీంతో మనస్తాపం చెందిన కల్వల శార్వాణి(20) సోమవారం అతివేగంగా వస్తున్న రైలు ఎదుట పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కల్వల ప్రదీప్‌కుమార్ కూతురు శార్వాణికి రెండేళ్ల క్రితం ఏపీలోని తిరుపతికి చెందిన యువకుడు గంగాధర్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. దీంతో రెండేళ్లుగా ఇద్దరూ చాటింగ్ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని గంగాధర్‌ను కోరింది. అయితే, తనకు ఇప్పటికే వివాహమైందని, పెళ్లి చేసుకోవడం కుదరదని ఆ యువకుడు తిరస్కరించాడు. తీవ్రమనస్తాపం చెందిన శార్వాని.. సోమవారం ఆ యువకుడితో ఫోన్‌లో మాట్లాడుకుంటూనే.. రామగుండం రైల్వేస్టేషన్‌లోకి చేరుకుంది. వేగంగా వస్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలును చూసి పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకుంది. శార్వాణి ఎన్టీపీసీలోని హోండా షోరూంలో ఉద్యోగిగా పనిచేస్తోంది. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జి వివరించారు.

ఎరియర్స్ చెల్లించండి



మాట్లాడుతున్న ముత్యంరావు

జ్యోతినగర్:ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికులకు ఇటీవల అలవెన్సు చెల్లింపు అంశంపై కుదిరిన ఒప్పందం మేరకు ఎరియర్స్‌ను దసరా పండుగలోపు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.ముత్యంరావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వర్తించే షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లోని 73 జీవోలను విడుదల చేయలేదని ఆయన అన్నారు. కనీస వేతన సలహా మండలి సూచనతో రెండేళ్లక్రితం జీవో–22 ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చి గెజిట్ చేయకుండా నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జీవో–22ను గెజిట్ చేసి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

24గంటలు దాటినా లభించని యువకుడి ఆచూకీ



యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న జాలర్లు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద బర్త్‌డే పార్టీ చేసుకొని గోదావరిలో గల్లంతైన ఎన్టీపీసీకి చెందిన యువకుడు కనకమేడల ధర్మతేజ ఆచూకీ 24 గంటలు దాటినా లభించలేదు. సోమవారం వేకువజాము నుంచి అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ నేతృత్వంలో ఎల్లంపల్లి, గుడిపేటకు చెందిన జాలర్లతో తెప్పల సాయంతో గోదావరిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. యువకుడు గల్లంతైన ప్రాంతం పూర్తిగా గుంతలతోపాటు విస్తీర్ణం అధికంగా ఉండడంతో యువకుడి ఆచూకీ గుర్తించడం కష్టతరంగా మారిందని తెలుస్తోంది. సుమారు రెండు కిలోమీటర్ల ప్రవాహం వరకు మత్స్యకారులు అనుమానాస్పద ప్రాంతాల్లో వలల సాయంతో గాలిస్తున్నారు. రాత్రి వరకు కూడా పురోగతి లేదని ఎస్సై పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జ్యోతినగర్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీంసింగ్ సూచించారు. సోమవారం స్థానిక సింధూర కళాశాల రోడ్డులోని మహి బజాజ్ షోరూంలో పల్సర్ 150 స్టైలిష్ మోడల్ బైక్‌ను విడుదల చేసి మాట్లాడారు. బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, నసీరొద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నర్సగౌడ్

కమాన్‌పూర్: రొంపికుంట గ్రామానికి చెందిన కోల నర్సగౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ ఠాకూర్ సోమవారం నియమాక ఉత్తర్వులు జారీచేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి పరిధి కేకేనగర్‌కు చెందిన లోకిని సరోజన(28) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చెందిందని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. బేగంపేటకు చెందిన సరోజనతో కేకేనగర్‌కు చెందిన లోకిని మధుకు పదేళ్లక్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. మధు ఆరేళ్లక్రితం జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయాడు. అప్పట్నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 2న తన అత్తామామ మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన సరోజన పురుగుల మందు తాగింది. కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరించగా చికిత్స పొందుతూ చనిపోయింది. మామ, మరిది వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తమ్ముడు ఉండాటి రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

భవనం పైనుంచిపడి తాపీమేస్త్రీ..

గోదావరిఖని: స్థానిక మార్కండేయ కాలనీలో కొత్త భవనం ప్లాస్టరింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవాశాత్తు మూడో అంతస్తు పైనుంచిపడి పాలేటి మాధవరావు(49) అనే తాపీమేస్త్రీ సోమవారం మృతి చెందాడు. ఎన్టీపీసీ ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న మాధవరావు.. బతుకుతెరువు కోసం నెల్లూరు నుంచి ఇక్కడకు వచ్చాడు. తనచిన్న కుమారుడు ప్రభుదేవాతో కలిసి ప్లాస్టరింగ్ చేస్తుండగా కాలుజారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన మేస్త్రీని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ సుగుణాకర్ తెలిపారు

బొగ్గుబాయి వార్తలు

కార్మికులకు అండగా బీఎంఎస్



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: బీఎంఎల్ సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తుందని యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం జీడీకే –2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 8వ వేజ్‌బోర్డు కాలంలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులందరికీ రూ.వెయ్యికి పైగా పెన్షన్ పెంచాలని వాదనలు వినిపించి ఒప్పించిన ఘనత బీఎంఎస్‌కే దక్కిందన్నారు. అక్టోబర్ 28న జరుగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలుపించాలని కోరారు. నాయకులు ఆకుల హరిణ్ మాదాసు రవీందర్, పెంచాల వెంకటస్వామి, తాట్ల లక్ష్మయ్య, బోడకుంట రాజేశం, ఎల్లావుల కోటయ్య, పోతరవేణి విజయ్, కుమార్ పింగిలి, అ జయ్ కుమార్, అరెల్లి వెంకటరాజం, కుమ్మరి నగేశ్,కారుపాకల మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరసన

గోదావరిఖని: విధినిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డు నాగయ్యపై దాడిని ఖండిస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజరత్నం పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగొద్దు

గోదావరిఖని: కలిసికట్టుగా ముందుకు సాగి ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు రక్షణ సూత్రాలు పాటించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య సూచించారు. సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో మాట్లాడారు. గనిలో రక్షణ చర్యలపై తరచూ తనిఖీలు చేయాలన్నారు. ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

గోదావరిఖని: పరిసర గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా యాజమాన్యం ముందుకు సాగుతోందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జవహర్‌నగర్ ఏరియాలో ఆర్వో వాటర్ ప్లాంట్‌కు సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కార్పొరేటర్లు మౌనిక, దొంత శ్రీనివాస్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ఏరియా ఇంజినీరు రాంమూర్తి పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ క్రీడా పోటీలు ప్రారంభం

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియా డిపార్ట్‌మెంటల్‌స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఓసీపీ –2 మేనేజర్ రామరావు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, సమన్వయకర్త బూస వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగం రావడం ఓ వరం

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం వరమని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ–3 ఏరియాలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన 9 మంది కుటుంబాల్లోని యువతకు సోమవారం జీఎం కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన ఉద్యోగాన్ని వదులుకోవద్దన్నారు. ఏరియా ఇం.ఇనీర్ పి.ఏ లీషా, ఐఈ డీజీఎం కె.చంద్రశేఖర్, డీవైపీఎంలు కె.మారుతి, గుర్రం శ్రీహరి, వి.సునీల్‌ప్రసాద్ పాల్గొన్నారు. కాగా, ఏపీఏ ఏరియాలో అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుడి కుటుంబ సభ్యుడికి జీఎం వెంకటేశ్వర్లు కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

రామగిరి: సెక్యూరిటీ సిబ్బంది నాగయ్యపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాధ్యులను శిక్షించాలని బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీరెడ్డి డిమాండ్ చేశారు. ప్రతినిధులు నూనె కొంరయ్య, శంకరయ్య పాల్గొన్నారు. కాగా, నాగయ్యపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు, బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీరెడ్డి జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

దాడులను నియంత్రించండి

రామగిరి: సింగరేణి ఆస్తుల పరిరక్షణకు పాటుపడుతున్న సెక్యూరిటీ సిబ్బందిపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, జీఎం కమిటీ సభ్యుడు ఇసంపల్లి రమేశ్ సోమవారం జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఫిట్ సెక్రటరీ బైరం సదానందం, నాయకులు శివశంకర్, తిరుపతి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే పరిష్కారం

రామగిరి: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం ఏఐటీయుసీతోనే సాధ్యమని ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు అన్నారు. సోమవారం స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో ఆర్జీ–3 డివిజన్‌లోని వివిధ సంఘాలకు చెందిన సుమారు 70 మంది కాంట్రాక్ట్ కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. నాయకులు గుత్తికొండ రాజేందర్, ఎంఆర్‌సీ రెడ్డి, తిరుపతిరావు, తూముల రాజేశం పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలి

మంథని: ప్రాణాలను లెక్క చేయకుండా భూగర్భ గనుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు తక్కువ పింఛన్ వస్తోందని రిటైర్డ్ కార్మికుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 25ఏళ్లుగా ప్రతినెలా రూ.400 మాత్రమే పింఛన్ వస్తోందని, ఈ సొమ్ముతో తాము ఎలా బతికేదని ప్రశ్నించారు. అందుకోసమే రాబోయే ఎన్నికల్లో కోల్‌బెల్ట్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని సంఘం నాయకులు నూనె రాజేశం, పోరెటి వెంకన్న, కొవ్వూరి రాయలింగు, వేహెట్టి రాజన్న, బోయిని రవీందర్, కొట్టె సాంబయ్య, అప్పల పోషమల్లు కోరారు.

'దాడి చేయడం శోచనీయం'

గోదావరిఖని: ఆర్జీ–3 ఏరియాలో సెక్యూరిటీ గార్డు నాగయ్యపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోశం డిమాండ్ చేశారు. సోమవారం జీఎం ఆఫీస్ పరేడ్‌గ్రౌండ్‌లో సెక్యూరిటీ గార్డులతో సమావేశం నిర్వహించారు. ఈనెల7న రెండోషిఫ్టులో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీగార్డ్ నాగయ్యపై లద్నాపూర్ సర్పంచ్ భర్త బడికల శ్రీనివాస్, అతడి అనుచరులు కలిసి చేసిన దాడిని ఖండించారు.

రాజలింగంకు పదోన్నతి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో రెవెన్యూ ఆఫీసర్(ఆర్‌వో)గా విధులు నిర్వర్తిస్తున్న టి.రాజలింగు గ్రేడ్–3 మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. మందమర్రి మున్సిపాలిటీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేసిన రాజలింగు.. గతేడాది ఆగస్టులో డిప్యుటేషన్‌పై రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చారు. ఈమేరకు ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.

గోదాంలతో రైతులకు మేలు



గోదాం ప్రారంభిస్తున్న శ్రీగిరి శ్రీనివాస్

సుల్తానాబాద్(పెద్దపల్లి): గోదాములతో రైతులకు మేలు కలుగుతుందని కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో నిర్మించిన రూర్బన్ గోదాములు, భవనం సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎరువులు, విత్తనాలతోపాటు రైతుల కోసం కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పన్నాల రాములు, బండ గోపయ్య, రేశ్ రెడ్డి, ఓదెలు, మేకల రాజయ్య, వుస్తెం గణేశ్, తెలుకుంట సుగుణాకర్, మనుపటి పోచమ్మ, గెల్లు పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

రామగుండం: స్థానిక బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇటీవల చేపట్టిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని టీఎస్ జెన్‌కో ట్రాన్స్‌కో డిస్కమ్స్ రిటైర్డ్ ఎంప్లాయీస్ సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం బీ థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎస్‌ఈ సానుకూలంగా స్పందిస్తూ స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇస్లావత్ సారయ్యానాయక్, గంగాప్రసాద్, తౌఫిఖ్, ఫారూఖ్‌ఖాన్, సలీం, జర్పుల శ్రీనివాస్‌నాయక్, నిసార్, షఫీక్ ఉన్నారు.

చీరలు పట్టివేత

- ముగ్గురిపై కేసు



పట్టుకున్న చీరలను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడరూరల్ మండలం ఎదురుగట్లలో ఓ పార్టీ నాయకుడు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడిచేసి పట్టుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో మహిళా సంఘం సభ్యురాలి ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలియడంతో దాడి చేశారు. అప్పటికే పంపిణీ చేసిన 200 చీరల నుంచి 42 చీరలను రికవరీ చేశారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఈ వెంకట్‌రెడ్డి ఫిర్యాదుతో మారపల్లి కరుణాకర్‌రెడ్డి, పొన్నం మేఘన, పిట్టల కీర్తనలపై కేసు నమోదు చేసినట్లు వేములవాడరూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఈ దాడిలో తహసీల్దార్ సుజాత, సీఐ కృష్ణకుమార్, ఎస్సై మారుతి ఉన్నారు.